## ఇన్‌స్టాగ్రామ్‌లో టీనేజర్ల కోసం కొత్త సిస్టమ్



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఇన్‌స్టాగ్రామ్‌లో టీనేజర్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని మెటా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. సినిమా పరిశ్రమలో అమలు అవుతున్న పీజీ13 రేటింగ్ మాదిరిగానే, ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా కంటెంట్ రేటింగ్ సిస్టమ్ ప్రవేశపెడుతున్నారు. దీని ద్వారా 13 ఏళ్ల పైబడిన టీనేజ్ యూజర్లకు మాత్రమే తగిన కంటెంట్ చూపించే విధంగా ప్లాట్‌ఫారమ్ నియంత్రణలు అమలు కానున్నాయి. మెటా ప్రకారం.. 18 ఏళ్ల లోపు ప్రతి యూజర్‌ను ఆటోమేటిక్‌గా 13+ కేటగిరీలో ఉంచుతారు. దీనర్థం, ఈ వయసు యూజర్లు చూసే కంటెంట్‌కు కఠినమైన ఫిల్టరింగ్ అమలవుతుంది.



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in



## 'ఎక్స్' కొత్త సెక్యూరిటీ ఫీచర్స్ ఇవే..!



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ప్రముఖ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' తన కంటెంట్ నాణ్యత, విశ్వసనీయతను పెంచే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఫేక్ అకౌంట్లు, తప్పుదారి పట్టించే పోస్టులు, తప్పుడు సమాచార వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో, యూజర్లు ఏ సమాచారం నిజమనే దానిని గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సంస్థ పారదర్శకతను పెంచే కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ ఫీచర్ ద్వారా ఒక అకౌంట్ ఏ దేశం నుంచి ఆపరేట్ అవుతోంది, ఎప్పుడు సృష్టించబడింది, ఎంతకాలంగా ఉందో స్పష్టంగా చూపించబడుతుంది.


15-10-2025 (Wednesday) | MAIN EDITION


## రాజేంద్రనగర్‌లో హైడ్రా కూల్చివేతలు




**అక్షరటుడే, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ మండలంలో కబ్జాలను హైడ్రా అధికారులు బుధవారం తొలగించారు. బద్వేల్ - ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లలో ఆక్రమణలకు గురైన నాలుగు పార్కులకు హైడ్రా విముక్తి కల్పించింది. 19,878 గజాల భూమిని ఆక్రమణ దారుల నుంచి స్వాధీనం చేసుకుంది.**

## రైతుల ఖాతాల్లోకి రూ.185 కోట్లు



**అక్షరటుడే, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తోతాపురి మామిడి రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. మామిడి విక్రయాలపై గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొన్న 40,795 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.185.02 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఈ విషయాన్ని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు ధ్రువీకరించారు.**

## శ్రీశైలంలో పర్యటించనున్న ప్రధాని



**అక్షరటుడే, కర్నూల్ : ప్రధాని మోదీ గురువారం కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. శ్రీశైలం ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటారు. శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం కర్నూల్‌లో సుమారు రూ.13,430 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభలో మాట్లాడతారు.**

## జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీకి బీజేపీ తన అభ్యర్థిని ఖరారు చేసింది. లంకల దీపక్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పలు రాష్ట్రాల్లో జరిగే ఉప ఎన్నికలకు సంబంధించి బీజేపీ అభ్యర్థులను పార్టీ ప్రకటించింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ స్థానం నుంచి దీపక్‌రెడ్డికి అవకాశం ఇచ్చింది. పార్టీ రాష్ట్ర నాయకత్వం దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, పద్మ పేర్లను సిఫార్సు చేసింది. ఇందులో కేంద్ర నాయకత్వం దీపక్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది. కాగా.. దీపక్ రెడ్డి 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే స్థానం నుంచి పోటీ చేశారు. ఆ సమయంలో ఆయనకు 25 వేల ఓట్లు వచ్చాయి. తాజాగా మరోసారి బరిలో నిలవనున్నారు.

## హైదరాబాద్ శివారులో రేవ్ పార్టీ భగ్నం..

**అక్షరటుడే, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పరిధిలోని కోర్పోలు చంద్రారెడ్డి రిసార్ట్‌లో నిర్వహించిన రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం రాత్రి రేవ్ పార్టీకి సంబంధించిన సమాచారం రావడంతో మహేశ్వరం ఎస్‌వోటీ బృందం, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఉన్న 72 మందిని అదుపులోకి తీసుకొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ పార్టీని వేద అగ్రి సీడ్స్‌కు చెందిన తిరుపతిరెడ్డి, రాక్‌స్టార్ ఫెర్టిలైజర్స్ యజమాని సైదా రెడ్డి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పార్టీని ఫెర్టిలైజర్ యజమానుల కోసం ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు.

**రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో సతమతమవుతోంది. మంత్రుల మధ్య ఆధిపత్య పోరు రోడ్డెక్కింది. ఎమ్మెల్యేల ధిక్కార స్వరం పెరుగుతోంది. సొంత పార్టీ శాసనసభ్యులే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో కొందరు నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సర్కారుకు చెడ్డపేరు తెచ్చేలా చేస్తున్నారు. అయితే చిన్నచిన్న విభేదాలు, మనస్పర్థలు సాధారణమేనని పార్టీ నాయకత్వం కొట్టిపడేస్తుండడం కేడర్‌ను కలవరపెడుతోంది.**

**—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# కట్టు తప్పిన కాంగ్రెస్

- **రచ్చకెక్కుతున్న విభేదాలు**
- **మంత్రుల మధ్య ఆధిపత్య పోరు**
- **తీవ్ర అసంతృప్తిలో ఎమ్మెల్యేలు**
- **సొంత సర్కారుపై బహిరంగంగానే విమర్శలు**
- **కట్టడి చేయడంలో విఫలమవుతున్న నాయకత్వం**

కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని పార్టీ నేతలు చెబుతారు. అయితే, అది శ్రుతి మించుతుండడమే ఆందోళన కలిగిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని, సొంత పార్టీని ఇరుకున పెట్టేలా వ్యవహరిస్తుండడం హైకమాండ్‌ను కలవరపెడుతోంది. సహచర మంత్రులు ఒకరంటే మరొకరికి పడని పరిస్థితి నెలకొంది. బహిరంగంగానే విమర్శించుకుంటుండడంతో సర్కారు చిక్కుల్లో పడుతోంది. మిగతా పార్టీల్లో క్రమశిక్షణకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. గీత దాటితే వేటు వేస్తారన్న భయం ఉంటుంది. కానీ, కాంగ్రెస్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది.

### మంత్రుల మధ్య రచ్చ రచ్చ

రాష్ట్ర కేబినెట్‌లో సమన్వయం లోపించింది. రోజురోజుకు అమాత్యుల మధ్య ఆధిపత్య పోరు తీవ్రంగా మారుతోంది. ఇప్పటికే పొన్నం ప్రభాకర్ - అడ్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ - పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ - అడ్లూరి లక్ష్మణ్ మధ్య వివాదాలు రచ్చకెక్కాయి. అడ్లూరి లక్ష్మణ్‌ను బాడీ షేమింగ్ చేస్తూ పొన్నం మాట్లాడిన తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఇది కాస్త తీవ్ర వివాదం కావడంతో పీసీసీ నాయకత్వం పిలిచి మాట్లాడి సర్దిచెప్పింది. వివాదం సద్దుమణిగిపోయిందని భావిస్తున్న తరుణంలో వివేక్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. అది కొనసాగుతుండగానే, కొండా సురేఖ - పొంగులేటి వివాదం బయటికొచ్చింది. తమ శాఖలో జోక్యం చేసుకోవడాన్ని కొండా సురేఖ బహిరంగంగానే విమర్శించారు. అంతకు ముందు నల్లగొండ జిల్లా మంత్రుల మధ్య కూడా విభేదాలు బయటపడ్డాయి. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. హెలికాప్టర్ వినియోగంపై పలువురు మంత్రుల మధ్య ఆధిపత్య పోరు నెలకొనడం అప్పట్లో కలకలం రేపిన విషయం తెలిసిందే.

### ఎమ్మెల్యేలది మరో తీరు

మంత్రుల తీరు అలాగుంటే, ఎమ్మెల్యేల తీరు మరీ దారుణంగా ఉంది. మంత్రి పదవి రాలేదని అలక బూనిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తరచూ సంచలన వ్యాఖ్యలు చేస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తున్నారు. ముఖ్యమంత్రిపైనే పరోక్షంగా విమర్శలు గుప్పిస్తున్నారు. మద్యం టెండర్ల విషయంలోనూ ఆయన సర్కారును ఇరుకున పెట్టేలా వ్యవహరించారు. ఇక, మరో ఎమ్మెల్యే సైతం ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది. ప్రభుత్వం కూలితేనే బాధితులకు న్యాయం జరుగుతుందని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం విశేషం. ఇక, కులాల వారీగా, గ్రూపుల వారీగా ఎమ్మెల్యేలు రహస్య సమావేశాలు నిర్వహిస్తుండడం గమనార్హం. మాల, మాదిగ, గిరిజన సామాజిక వర్గాల వారీగా విడిపోయారు. యువ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గతంలో ఒక హోటల్‌లో రహస్యంగా సమావేశం కావడం కలకలం రేపిన విషయం తెలిసిందే.

### సమన్వయం చేయడంలో విఫలం

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో పార్టీ మనుగడనే ప్రశ్నార్థకమైన పరిస్థితుల నుంచి అనూహ్యంగా పుంజుకుని గద్దెనెక్కింది. అయితే, కేసీఆర్ సర్కారుపై వ్యతిరేకతే కాంగ్రెస్‌కు అవకాశం తీసుకొచ్చింది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ అరాచకాన్ని భరించలేక తప్పనిసరి పరిస్థితుల్లో హస్తం పార్టీ వైపు మొగ్గు చూపారు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన కాంగ్రెస్ కలహాలతో సతమతమవుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతల మధ్య సమన్వయం లోపించింది. ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యేలను, మంత్రులను సమన్వయం చేయడంలో ముఖ్య నేతలు విఫలమయ్యారనే భావన నెలకొంది.

## 25 నుంచి 'జనం బాట': కవిత



**అక్షరటుడే, హైదరాబాద్:** సామాజిక తెలంగాణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడించారు. అక్టోబర్ 25 నుంచి ఫిబ్రవరి 13 వరకు నాలుగు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను హైదరాబాద్ జాగృతి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల త్యాగాలకు విలువ రావాలంటే సామాజిక తెలంగాణ రావాలన్నారు. ఇదే లక్ష్యంతో త్వరలోనే తెలంగాణ వ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటో లేకుండానే జాగృతి ముందుకెళ్తుందన్నారు. కేసీఆర్ చుట్టూ దుర్మార్గులు ఉన్నారని, వారి నుంచి కాపాడేందుకు తాను అన్ని ప్రయత్నాలు చేశానన్నారు. కానీ తననే పార్టీ నుంచి పంపించేశారన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం జాగృతి పోరాటం చేస్తుందని కవిత తెలిపారు.

## ఓట్ల చోరీపై కేటీఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం



**అక్షరటుడే, నిజామాబాద్:** జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ జరిగిందని కేటీఆర్ అనడం హాస్యాస్పదమని ఎంపీ అర్వింద్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొంగ ఓట్లు తెచ్చిందే బీఆర్ఎస్ పార్టీ అని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో అపార్ట్‌మెంట్‌లో 43 ఓట్లు దొంగ ఓట్లయితే, బోధన్‌లో బీఆర్ఎస్ హయాంలో 42 దొంగ పాస్‌పోర్టులు ఇచ్చిన సంగతి మరిచారా అంటూ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్థులకు గతంలో ఆశ్రయం ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీనే అని గుర్తుచేశారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీలను బీజేపీ మోసం చేస్తోందన్నారు. తెలంగాణలో ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీసీని సీఎంను చేస్తామని చెబుతారని, ఎన్నికలయ్యాక వదిలేస్తారని తెలిపారు. తెలంగాణ బీజేపీలో అంతా కిషన్‌రెడ్డిదే నడుస్తోందన్నారు. 'ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం.. కిషన్‌రెడ్డి రాజ్యమని' వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీసీలకు అవకాశం దక్కదని విమర్శించారు. అసలు బీసీని ముఖ్యమంత్రిని చేస్తామంటున్న కిషన్‌రెడ్డి.. బీజేపీలో బీసీల పరిస్థితి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు.

## పాక్–అఫ్గాన్ మధ్య మళ్లీ ఘర్షణలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ మధ్య మంగళవారం రాత్రి మళ్లీ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. రెండు దేశాలు దాడులు చేసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఇటీవల దాడులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మొదట పాకిస్థాన్ తమపై వైమానిక దాడులు చేపట్టినట్లు అఫ్గాన్ తెలిపింది. దీంతో పాక్ సైనిక పోస్టులపై తాలిబన్లు దాడులు చేపట్టారు. అనంతరం ఘర్షణలు ఆగిపోగా.. మళ్లీ మంగళవారం రాత్రి ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ముందుగా అఫ్గాన్ సైన్యం దాడులకు పాల్పడిందని పాక్ ఆరోపించింది. తాలిబన్ల దాడులను తాము తిప్పికొట్టినట్లు పాక్ సైన్యం చెప్పింది.

## మహారాష్ట్ర సీఎంకు ఆయుధాలు అప్పగించిన మల్లోజుల



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** మావోయిస్ట్ అగ్రనేత, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఆ విషయాన్ని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బుధవారం అధికారికంగా ప్రకటించారు. గడ్చిరోలి ఎస్పీ ఆఫీసులో సీఎం ఫడ్నవీస్ ప్రెస్‌మీట్ పెట్టారు. మల్లోజులతో పాటు మరో 60 మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. ఈ క్రమంలో ఆయనతో పాటు మిగతా మావోలు సీఎంకు బుధవారం ఆయుధాలను అప్పగించారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ.. మావోయిస్టులు లొంగిపోవాలని సూచించారు. గత నాలుగేళ్లలో ఈ ప్రాంతం నుంచి ఒక్కరు కూడా ఉద్యమంలో చేరలేదని చెప్పారు. ఈ పురోగతికి సీ60 కమాండోల కృషి, రాజ్యాంగ పాలనపై పెరుగుతున్న నమ్మకమే కారణమన్నారు. అభివృద్ధి, శాంతి పట్ల ప్రభుత్వ నిబద్ధతను ఆయన నొక్కిచెప్పారు.

## అభివృద్ధికి, అరాచకానికి జరుగుతున్న ఎన్నిక: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీలు, వ్యక్తుల మధ్య జరుగుతున్నది కాదని.. పదేళ్ల అభివృద్ధి పాలనకు.. రెండేళ్ల అరాచక పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత బుధవారం తొలి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమానికి కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ , పద్మారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారన్నారు.

## నేను ఈ గ్రహం మీద నివసించను



**బాలీవుడ్ సూపర్ స్టార్ శ్రీదేవి ముద్దుల కుమార్తె జాన్వీ కపూర్ 'ధడక్' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ముద్దుగుమ్మ, ఆ తర్వాత 'ది కార్గిల్ గర్ల్', 'రూహి', 'మిలీ', 'గుడ్ లక్ జెర్రీ' వంటి సినిమాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. అయితే ఈ అమ్మడు పారిస్‌లోని మియూ మియూ ఫ్యాషన్ షోకు హాజరై మంత్రముగ్ధులను చేసింది. ఈ షోలో తన లుక్‌తో అదరగొట్టింది. అలానే ఫన్ రాపిడ్-ఫైర్ సెగ్మెంట్‌లో పాల్గొని తన హాస్యభరితమైన, రొమాంటిక్ యాంగిల్‌ని అభిమానులకు చూపించారు. జాహ్నవి ప్రేమ, ఫుడ్ మరియు ఫ్రెంచ్ కల్చర్ గురించి ఆసక్తికర విషయాలు మాట్లాడింది. ప్రేమ గురించి మాట్లాడుతూ.. 'తనకి చాలా ఆఫెక్షన్ కావాలి. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఫుడ్ ప్రిపేర్ చేయాలి. నన్ను నవ్వించాలి' అని పేర్కొంది. 'నాది మీన రాశి కాబట్టి నేను ఈ గ్రహం మీద నివసించను' అని ఆమె చమత్కరించింది.**

**—అక్షరటుడే, సినిమా డెస్క్**